# ఆపద్ధర్మం

ఈ రోజుల్లో మనకు నచ్చేరీతిలో జీవించాలనుకోవడం ఒక పెద్ద సవాల్ అయిపోయింది. మనం ఇష్టపడని పనులే చచ్చినట్టు చేయాల్సి వస్తోంది. ఇక దిగేక అడుసు తొక్కకూడదనుకుంటే అయ్యేపనా?

డబ్బు చేదు కాకపోవచ్చు. అలాని భూముల్ని అమ్మి డబ్బు చేసుకోవాల్సిన దుస్థితిలో నేను లేను. నాది పెద్ద ఉద్యోగం. మా ఆవిడది కూడా పెద్ద ఉద్యోగం. బెంగుళూరులో సొంతంగా ఒక పెద్ద బంగళా. ఇద్దరు పిల్లలతో సురక్షితంగా, సుఖంగా వున్నాను.

అయిష్టంగా వైజాగ్ వచ్చేను. నా భూమి మూడెకరాలను కళ్ళకద్దుకొని రెండు కోట్లు ఇచ్చే పార్టీతో చేతులు కలిపేను. ఇదే ఆఖరు. ఇక వైజాగ్ వచ్చేపని పడదు. వైజాగ్‌కి ఇరవై మైళ్ళ దూరంలోనున్న మా పల్లెకి వెళ్ళేది లేదుగాక లేదు. ఆ మనుషులూ వద్దు. వాళ్ళతో ఏ బంధాలు వద్దు.

లాడ్జిలో ఉన్నానుగాని మా వూరు వెళ్ళలేదు. వెళ్ళకుండానే నా పనికి కావాల్సిన వాడు సన్నిబాబుని సెల్‌ఫోన్‌లో పిలిచేను. వెధవ. వాడినొక్కడినే పిలిస్తే మరో ఇద్దర్ని వెంటేసుకొని మరి వచ్చేడు. నాకు చిర్రెత్తుకొచ్చింది. ఏం చేయడం వాడితో అవసరం వుంది. నా ల్యాండ్‌ని కొనే పార్టీని వాడే అరేంజ్ చేశాడు మరి. ఈ వ్యవహారం అయిపోతే వాడెవడో, నేనెవరో!

సన్నిబాబుతో వచ్చిన వాళ్ళు ఖర్మకొలది నాకు చుట్టాలవుతారు. పోలి నాయుడు నాకు బావ. రవణమ్మ నాకు చెల్లెలు. వాళ్ళు వచ్చింది నన్ను చూసిపోవడానికి కాదు. భూమి డీల్‌లో నాకు వస్తున్న రెండుకోట్లలో ఓ రెండు లక్షలు పట్టుకుపోవడానికొచ్చేరు. దానికి అప్పు అని పేరు పెట్టేరు. వ్యవసాయానికి

ఆయువు మూడిందని అందరికీ తెల్సు. రెండు లక్షలు ఎత్తుకుపోయి. ఆత్మహత్యల రైతు ఏమి అప్పు తీరుస్తాడు? ఒక వేళ తీర్చగలిగినా సరే... పైసా ఇచ్చేది లేదు. అవసరానికే మనుషులు. దగా, ద్రోహం చేయడానికే మనుషులు. రక్త సంబంధీకులే రక్తపోడల్లా కాటేస్తున్నారు. నేనెవర్నీ నమ్మను. నాకెవరూ అక్కర్లేదు. నా ఒళ్ళు భగభగామండి పోతోంది.

పోలినాయుడిని చూస్తే రోగంతో ఏ క్షణంలోనైనా చివికి పోయే బుడగలా వున్నాడు. రెండు కిడ్నీలు చెడిపోయేయట. ఆపరేషన్‌కి కొంత డబ్బు కూడబెట్టినా మరో రెండు లక్షలు కావాలట. ఒక కిడ్నీని దానం చేయబోయేదాత, ఆపరేషన్ చేయడానికి అవసరమయ్యే డాక్యుమెంట్లు నాకు చూపబోయేరు. నేనెందుకు చూడాలి? ఏ కాగితం చూసేది లేదు. చిల్లిగవ్వ ఇచ్చేది లేదు.

'నా పసువు కుంకం కాపాడు అన్నయ్య' అని ఏడ్చింది రవణమ్మ.

నాలో అసహనాన్ని చికాకుని అణచుకొని నెమ్మదిగా అన్నాను – 'చూడమ్మా ఈ ఊరు నేనొక పనిమీద వచ్చేను. ముందు ఆ పని కానివ్వండి. మధ్యలో నన్ను డిస్టర్బ్ చేయకండి. తర్వాత చూద్దాం. దయచేసి వెళ్లండి'

ఏమనుకున్నారో ఏమో. మారు మాటాడకుండా బుద్ధిగా వెళ్ళిపోయేరు. వెళ్తున్నపుడు చెల్లెలు చేతిలో రెండువేలు పెట్టబోయేను. నగరానికి ఎలాగూ వచ్చేరు గనుక డయాలసిస్ చేయించుకొని వెళ్ళిపోతామన్నారు. అందుకు రెండువేలు ఇవ్వబోతే వద్దన్నారు. అందుకు తమ వద్ద డబ్బులున్నాయట.

అవును. మీకు వేలైతే ఆనవు. లక్షలు కావాలి లక్షలు.

నాదే బుద్ధితక్కువ. ఇదిగో రిజిస్ట్రేషన్ వ్యవహారం కానివ్వండి. ఇక ఎవ్వరికైనా కనిపిస్తే ఒట్టు. సన్నిబాబు వాళ్లని ఇలా తీసుకురావడం నాకు ఏమాత్రం నచ్చలేదు.

***

సన్నిబాబు బ్రోకర్ కాదు. నాకు స్నేహితుడు కాదు. బంధువు కాదు. ఏ విధంగానూ నాతో సరితూగ గలవాడు కానేకాదు. అతడు ఒక ఆటో డ్రయివర్. నన్ను తన చిననాటి స్నేహితుడిగా అందరితో గొప్పగా చెప్పుకుంటాడు. చెప్పుకోనియ్. నాకెందుకు అభ్యంతరం!

నిజమే. మా గ్రామంలో బాల్యంలో మేమిద్దరం కలిసి మెలసి తిరిగాం. కలసి స్కూల్‌కి వెళ్ళాం. కలిసి చెరువులో ఈతకొట్టాం. ఇపుడా చెరువు ఏమయ్యిందో తెలీదు. చెరువు ఏమిటీ గ్రామమే ధ్వంసమయి పోతోంది.

అప్పటికీ ఇప్పటికీ మార్పు లేనిది సన్నిబాబు ముఖంలో నవ్వు. స్వచ్ఛమైన నవ్వు. వాడి నవ్వుని దారిద్ర్యం చెరిపేయలేకపోయింది. అతని తండ్రి అప్పులతో పొలం కోల్పోయి ఆత్మహత్య చేసుకున్నాడు. సన్నిబాబు చదువు ఆగిపోయింది. నేను నగరానికి కాలేజీ చదువులకెళ్ళితే వాడు కూలిపనులు చేసేడు. నగరం వచ్చి మురికివాడలో వుంటూ అద్దెకి  ఆటో తిప్పేవాడు. అక్కడే గంగను ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. వాళ్ళకి ఒకబిడ్డ పుట్టి అనారోగ్యంతో చచ్చిపోయింది. ఆ తరువాత ఏంచేతో మరిక సంతానం కలగలేదు. అందుకు దిగులు చెందలేదు. తర్వాత ఆటో యజమానితో గొడవపడి గ్రామానికి వచ్చేసాడు.

గ్రామానికి వచ్చేసాక వాడికి మానాన్న బ్యాంక్‌లోన్ ద్వారా ఆటో కొనిపించేడు. ఇక నగరానికి వెళ్ళలేదు. ఆటోను మాగ్రామం నుంచే చుట్టుపక్కలకు, ఎక్కడికి పడితే అక్కడకు, అవసరమైతే నగరానికి కూడా తిప్పడం ఆరంభించేడు.  వూళ్ళో డొక్కుబస్ తిరుగుతోంది. ఇప్పటికీ తిరుగుతోంది. కాని సన్నిబాబు ఆటో వచ్చేక బస్సుకోసం ప్రత్యేకంగా ఎదురు చూడడం మానేశారు.

రాత్రిలేదు. పగలు లేదు. ఆటో కావాలనుకునే సమయంలో కావల్సిన వాళ్ల ఇంటి ముందు ప్రత్యక్షమయ్యేది. అంతేకాదు నగరానికి ఆటోవెళితే వూళ్లోకావాల్సిన వాళ్ళకు మందులు, వస్తువులు, ఏది కావాలంటే అది తెచ్చిపడేసేవాడు. ఒకవైపు బస్సు వచ్చిపోతున్నా, మరో రెండు, మూడు ఆటోలు వూళ్లోకి ప్రవేశించినా సన్నిబాబు ఆటోకి ఎప్పుడూ డిమాండే. వాడి ఆటోలో పదిమంది కాదు. ఎంతమంది ఎక్కినా రండిరండి ఎక్కండి అంటుంది. అదొక పుష్పక విమానం. ఒక్కమాటలో చెప్పాలంటే సన్నిబాబు ఆటో లేకుండా మావూరు వుండలేని స్థితికి వచ్చేసింది.

సన్నిబాబు భార్య గంగ పట్నం పిల్ల కావడంతో పల్లెలో వుండలేకపోయింది. ఆమె నగరం వెళ్లిపోదాం అంటుంది. 'లేదు. ఇక్కడే వుందాం' అంటాడు సన్నిబాబు. దాంతో ఇద్దరిమధ్య గొడవలు. తర్వాత చడీ చప్పుడు లేకుండా నగరం పారిపోయి, అక్కడ మరెవ్వరితోనో లేచిపోయింది. అయినా వాడి ముఖంలో నవ్వు చెదరలేదు. మళ్ళీ పెళ్ళి చేసుకోలేదు. అయినా వాడు ఒంటరికాదు. వూళ్ళో వాళ్ళంతా వాడి మనుషులే. అందరూ కావాలనుకుంటాడు. అందర్నీ ప్రేమిస్తాడు. అవసరమైతే ప్రాణాలిస్తాడు. వాడికున్న బలహీనతలు ఏమిటంటే రాత్రులు మందుకొద్దిగ కొడతాడు. నగరంలో ఏ కొత్త సినిమా వచ్చినా వూళ్ళో కుర్రాళ్ళను వెంటేసుకొని సెకండ్ షో సినిమాకి వెళ్లిపోతాడు.

నేనెప్పుడు ఈ వూరొచ్చినా నన్ను కలియకుండా వుండడు. నన్ను చనువుగా 'అన్నా' అంటూ వరసపెట్టి పిలిచినా, సభ్యతా సంస్కారాలతో తను వుండవలసిన స్థానంలోనే వుంటాడు. నెత్తికెక్కడు. అతిగా ప్రవర్తించడు.

వాడి వయసు నలభై రెండు వుంటుంది. ఇంచుమించు నా వయసే.

వాడి అవసరం నాకు పడింది. వాడు తెచ్చిన పార్టీ వల్ల మిగిలిన భూమి కూడా అమ్మకమయ్యింది. మధ్యలో బ్రోకర్లు వుంటే కమీషన్ అంటూ మీద పడిపోతారు. వీడు నా నుంచి ఏమి ఆశిస్తున్నాడో తెలియదు. నేనడగలేదు. నాకు చెప్పలేదు.

భ్రష్టుపట్టిపోయిన ఈ వ్యవస్థలో సన్నిబాబుని కూడా నేను నమ్మను.

***

ప్రపంచీకరణ నేపథ్యంలో నేడు సామాజికంగా వస్తున్న మార్పుల్లో ఏది అనుసరించాలో, దేనిని తిరస్కరించాలో తెలీని అయోమయస్థితిలో వున్నానని పిస్తోంది.

కాలేజీ రోజుల నుంచి కొంతలో కొంత వామపక్షభావజాలంతో ఎదిగిన నేను ఈ మధ్య నా భూమి చుట్టూ తిరుగుతూ డబ్బులు బ్యాంకుల్లో వేసుకోవడం నాకే చిత్రంగా అనిపిస్తోంది.

మాది ఏడెకరాల పొలం. మానాన్న టీచర్‌గా పని చేస్తుండటంతో పొలం వ్యవహారం అంతా మా చిన్నాన్న చూసుకునేవాడు. ఎంత దూరమైన సరే... నాన్న స్కూలుకి సైకిల్‌పై వెళ్లి వస్తుండేవాడు. నలుగురు సంతానంలో నేను ఒక్కణ్ణే మిగిలాను. ఇద్దరు తమ్ముళ్లు రోగాలతో చనిపోతే, పదహారేళ్ల చెల్లి ఆత్మహత్య చేసుకుంది. ఒక దళితుణ్ణి ప్రేమించి నెగ్గుకురాలేకపోయింది. పరువు ప్రతిష్టలు తీశావంటూ చేసిన మా అమ్మ నాన్నల దాడిని తట్టుకుని, ఎదురు నిలవలేక పోయింది. చెల్లెలు మరణం నన్ను బాగా కలచివేసింది. నా చెల్లెల్ని చంపిన హంతకులు మీరేనని అమ్మా నాన్నలపై కేకలు వేసి, ఏడ్చి, చాలా రోజులు వాళ్లతో మాటాడటం మానేశాను. అభ్యుదయ భావాలతో పెరిగిన వాడిని. నేను చేసిందేమిటి. మా చెల్లెలికి దన్నుగా నిలిచి ఎందుకు ధైర్యం చెప్పలేకపోయాను? నాపై నాకే అసహ్యం వేసింది.

నన్ను ఇంజనీరింగ్ కష్టపడి చదివించేడు నాన్న. ఇంజనీరింగ్ చేసిన మా కులం అమ్మాయినే చూసి నా పెళ్ళి జరిపించేడు. అయిదు లక్షల కట్నం. నాకు అసహ్యం. తీసుకోవద్దని బ్రతిమిలాడేను. నాన్న ఒప్పుకోలేదు. 'వాళ్ళు వున్నవాళ్ళు.

సంతోషంతో ఇస్తున్నారు. అప్పుచేసి కాదు కదా' అని కట్నం తీసుకున్నాడు. ఆ లక్షలు బ్యాంక్‌లో కాకుండా భూమి మీదపెట్టేడు. నగరం పొలిమేరల్లో కొన్నాడు. వ్యవసాయం కోసం కాదు. మార్కెట్ కోసం. తను రిటైరయ్యేక వచ్చిన సొమ్మును బ్యాంకుల్లో వుంచడం బుద్ధితక్కువ పని అన్జెప్పి అదంతా భూములపై పెట్టేడు. ఆ భూములు ఒక్కసారిగా వువ్వెత్తున, వూహించనంత ఎత్తుకు మార్కెట్ రేటు పలికింది. లక్షలు కోట్లు అయ్యేయి.

జాక్‌పాట్ కొట్టినట్లు మానాన్న ఆనందం అంతా ఇంతా కాదు. చిత్రమేమిటంటే ఆ బంగారు భూముల్ని ఏ ఒక్కటీ నేను చూడలేదు. మానాన్న ఎప్పటికప్పుడు బలవంతం చేసినా... ప్రత్యేకంగా వెళ్ళి చూడటానికి సుముఖత చూపే వాడిని కాదు...అవును. నాకు ఏ మాత్రం ఉత్సాహం వుండేది కాదు. మానాన్నకి ఎంతో ప్రధానమైన భూములు నాకు అప్రధానమయ్యేయి.

రిటైర్ అయ్యేక నాన్న డొక్కు మోపెడ్ వేసుకొని అదే పనిగా తిరుగుతూ భూముల సంరక్షణ చూసుకునేవారు. ఆ భూముల్ని అలా వుంచేయకుండా టేకు మొక్కలో లేదా సరివెడు మొక్కలో వేయించడం, మామిడి, కొబ్బరి పెంచడం, ఆ భూముల్లోనే గడిపి ఏ సాయంత్రమో ఇంటికి వచ్చేవాడు నాన్న.

ఆ వయసులో అలా తిరగవద్దని ఎంత మొత్తుకున్నా వినేవాడు కాదు. పోనీ కారు కొనుక్కొని ఒక డ్రయివర్‌ని పెట్టుకొని తిరగమంటే, 'వద్దు. ఈ మోపెడ్‌చాలు' అనేవాడు.

బంగారు భూములపై నేనేమాత్రం ఉత్సాహం చూపకపోవడంతో నాన్నకి కోపం వచ్చినట్టుంది. 'నీ ఆస్తుపాస్తులను ఎందుకు చూసుకోవో నేను చూస్తాను' అన్నట్టు మా నాన్న హఠాత్తుగా గుండెపోటుతో మరణించేడు. అమ్మా, నాన్నా ఇంచుమించు ఒక ఏడాది తేడాలో చనిపోయేరు. అమ్మ మరణం కన్నా నాన్న మరణం నన్ను విపరీతంగా కుంగదీసింది. భూముల డాక్యుమెంట్లు భద్రంగా నా వద్ద వున్నా... ఏ భూమి ఎక్కడుందో, ఇపుడు నేను చేయాల్సినదేమిటో నాకు తెలీని స్థితి. అంతా అయోమయం. ఈ స్థితిలో నాకు దారి చూపేదెవరు?

చిన్నాన్న ముందుకొచ్చేడు. చిన్నాన్న కొడుకు...నా తమ్ముడు చంద్రం ముందు కొచ్చేడు. ఇద్దరూ నాకు ధైర్యం చెప్పేరు. ఆ భూముల సంగతి వాళ్ళపై వదిలేసి నన్ను నిశ్చింతగా వుండమన్నారు.

చిన్నాన్నకి ముగ్గురు కూతుళ్ళు. ఒక్కడే కొడుకు వాడే చంద్రం.వాడు సరిగా చదవలేదు. ఇంటర్‌తో ఆగిపోయింది. మానాన్న ఆడపిల్లల పెళ్ళికి కొంత ఆర్థిక

సాయం చేయడమే కాక, చంద్రంకి వీఆర్వో ఉద్యోగం వచ్చేలా చూసేడు.

నా తమ్ముడు వీఆర్వో ఉద్యోగి కావడంతో నా గుండె దిటవు అయింది. నాన్నతో కలసి చూడనిరాకరించిన భూముల్ని మొత్తం తమ్ముడితో కలిసి చూసేను చచ్చినట్టు. అయితే క్రమక్రమేణ నా భూములు నన్ను ఇబ్బంది పెట్టడం మొదలెట్టాయి. మానాన్న ఉన్నప్పుడు లేని భూ సమస్యలు ఇపుడు ఒక్కసారిగా విరుచుకుపడి నన్ను విపరీతంగా చికాకు పెట్టసాగేయి. ఫెన్సింగ్‌లన్నారు. ప్రహరీలు అన్నారు. వాచ్‌మెన్‌లు వుండాలన్నారు. కొన్ని అప్రూవల్స్ కోసం ఉడా చుట్టూ తిరగాలన్నారు. ఎంత అడిగితే అంత డబ్బు పంపిస్తునే వున్నాను. ఇదిలా వుండగా మరో పెద్ద సమస్య. నేను పరిగెత్తక తప్పలేదు వైజాగ్.

కోటి రూపాయిలు విలువ చేసే ఆనందపురంలోని నా ల్యాండ్ ఎవరో అక్రమార్కుడి కన్ను పడింది. ఏవో నకిలీ డాక్యుమెంట్స్ తయారు చేసి చూపిస్తున్నాడు. కట్టిన ప్రహరీ ధ్వంసం చేసి లోనకి చొరబడి పోయేడు. ఇక గొడవలు. రౌడీలు. పోలీసులు. అధికారులు. రాజకీయ నాయకులు. భూకబ్జాలు చేయడమే వాడి పనట. వాడి పేరు వెంకట్రావు.

ఈ దేశంలో ఏ భాగమైనా ఎవరికైనా చివరికి విదేశీయుడికైనా అమ్మిపారేయవచ్చని నిరూపిస్తున్న భయంకర వాతావరణంలో బతుకుతున్నాం. కోట్ల సంపాదనకు,ఆక్రమణకు ఏదారి తొక్కినా తప్పుకాదన్న అభిప్రాయం బలపడుతున్న రోజులివి. ఈ కూపంలోకి నన్ను కూరుకుపోయేలా చేసిన స్వర్గీయ నాన్నపై కోపం. ఈ భయంకర అక్రమార్కుడితో నేనెలా తలపడగలను? వాడితో యుద్ధం నేనెక్కడ చేయగలను? నేనూ డబ్బు విపరీతంగా జల్లేను. అయిష్టమూ, అవినీతి గాడిద గుద్దూ అంటే ఈ లోగా వాడు జెండా పాతేస్తాడు. చివరకు పోలీసులు తిన్నంత తిని 'ఇది సివిల్ మాటర్' కోర్టులో తేల్చుకోమని చెప్పి తప్పుకున్నారు.

సరిపోయింది. కోర్టుల చుట్టూ నేనెక్కడ తిరగ్గలను? అది అయ్యేపనికాదు. అంచేత అక్రమార్కుడితో మనం రాజీపడిపోదాం అన్నారు మా చిన్నాన్న మరియు తమ్ముడు. రాజీపడటమంటే ఎంతో కొంతకి భూమిని వాడికి అమ్మేయడం. మొత్తానికి ఆ భూమిని అమ్మేసాను. తక్కువ ధరకి అమ్మినందుకు బాధపడలేదుగాని దురాక్రమణ చేసిన దుర్మార్గుడికే అమ్మే దుస్థితికి బాధపడ్డాను. అయితే ఈ విషయంలో నన్ను దిగ్భ్రాంతికి, మరెంతో బాధకీ గురిచేసినది ఏమిటంటే ఇదంతా ఒక కుట్ర అనీ, మా చిన్నాన్న, తమ్ముడు సదరు అక్రమార్కుడితో చేతులు కలిసి ఈ పథక రచన చేశారని!

నా సొంత మనుషులు నాపై చేసిన కుట్రకి తట్టుకోలేకపోయేను. నేనిక ఎవర్ని నమ్మాలి? నాకు నా వాళ్ళపై అసహ్యం వేసింది. వాళ్ళేకాదు మొత్తం ప్రపంచం మీదే అసహ్యం వేసింది.

ఈ విషయం నా చెవిన వేసి, ఒక అనుమానంగా వ్యక్తం చేసి, ఇక మీదటైనా జాగ్రత్తపడమని చెప్పినవాడు సన్నిబాబు.

అది అనుమానం కాదు, వందశాతం నిజం అని కన్‌ఫర్మ్ చేసింది నా మిత్రుడు రాజీవ్.

***

రాజీవ్ హైదరాబాద్‌లో వుంటాడు. నేను పనిచేస్తున్న కంపెనీ పనిపై వెళ్ళి... రాజీవ్‌ని ఒక సాయంత్రం కలిసాను. మా తమ్ముడు చంద్రం చేసిన ద్రోహం గురించి చెప్పేను.

చంద్రం సెల్‌ఫోన్ నెంబర్ నన్ను అడిగేడు. అడిగి వాడికి రాజీవ్ ఫోన్ చేశాడు. తనొక రియల్‌ఎస్టేటర్ నన్న వివరాలు చెప్పి 'కొత్తవలస వద్దనున్న మీ అన్నయ్య రెండెకరాల ల్యాండ్ నాకు కావాలి. మార్కెట్ రేటుకే తీసుకుంటాను. ఈ మధ్య ఆనందపురం ల్యాండ్ విషయంలో మా మిత్రుడు వెంకట్రావుకి మీరు చేసిన సహాయం నేనెరుగుదును. అదే పద్ధతిలో మీకు కమీషన్ ఇచ్చుకుంటాను తొందరలేదు. ఏడాదిలోగా ఆ స్థలం నాది అయ్యేలా చూడండి. మీతో కాంటాక్ట్‌లో వుంటాను' అని అన్నాడు రాజీవ్.

ఆ ప్రపోజల్‌కు మా తమ్ముడు ఓకే చేస్తూ కమీషన్ ఫైవ్ పర్సెంట్ అడిగేడు. అదంతా నేను వింటున్నాను. నా ఒళ్ళు మండిపోయింది. చంద్రం ఎదురుగా వుంటే చంపేసేవాడిని. ఆ రాత్రి విస్కీతో నన్ను కూల్ చేశాడు రాజీవ్.

రాజీవ్ నాకు ఇంజనీరింగ్‌లో క్లాసుమేట్. క్లోజ్‌ఫ్రెండ్. వీర మార్క్సిస్టు. విప్లవానికి మావో ఆలోచనా విధానమే సరైన దారి అని నొక్కి చెప్పేవాడు. అలాంటి వాడు అమెరికాలో ఉద్యోగం చేస్తూ మార్కెట్ దారి పడిపోయేడు. మధ్యలో ఉద్యోగం వదిలేసి ఒక సంస్థను పెట్టి బిజినెస్ నడిపేడు. బిజినెస్ బ్రహ్మాండంగా సాగడంతో డాలర్స్‌ని హైదరాబాద్ ల్యాండ్స్‌పై కురిపించాడు.

అతికొద్దికాలంలోనే ఆ ల్యాండు మిరుమిట్లుగొలిపే మెకన్నాస్ గోల్డ్ అయింది. ఆ బంగారు భూముల్ని కాపాడుకోవడానికి తప్పనిసరి పరిస్థితుల్లో అమెరికా నుంచి హైదరాబాద్‌కి ఫేమిలీతో సహా పూర్తిగా వచ్చేశాడు. బంజారాహిల్స్‌లో బ్యూటీఫుల్ భవంతి ఒకటి కట్టుకున్నాడు. ఒక ఆఫీస్ పెట్టి తనే స్వయంగా

భూముల్ని చూసుకోవడం మొదలెట్టేడు. భూ కబ్జాదారుల దాడిని తను ఒక్కడు ఎదుర్కోవడం కష్టమయింది. తన పేరులో కులాన్ని ఒకప్పుడు తొలగించుకున్న రాజీవ్ తమ కుల సంఘాన్ని ఆశ్రయించేడు. కుల పెద్దలకి పార్టీలు ఇచ్చేడు. రాజకీయాల్లోకి చేరేడు. అధికారులతో, మంత్రులతో స్నేహాలు చేసేడు. తన వెనుక కొంతమంది రౌడీలను పెట్టుకొని భూముల్ని కాపాడుకోవడమే కాక తనిప్పుడు విజయవంతంగా రియల్ఎస్టేటు బిజినెస్ నడుపుతున్నాడు.

కాలేజీలీపాడుకోవడం నాకు చేత కాని పని. నాకు నచ్చని పని, అంచేత నా భూములన్నీ అమ్మేయడానికి నిర్ణయించి అలాగే అమ్మేశాను.

రీజనబుల్ రేట్లకే అమ్ముడుపోయాయి. ఇక చివరిది. పెద్ద డీల్. రెండు కోట్ల వ్యవహారం. గుండెలు గుబగుబలాడినా అంతా సవ్యంగా సాగిపోయింది. ఏ ఇబ్బందులు లేకుండా రిజిస్ట్రేషన్ తతంగం ముగిసింది. నాకు తృప్తిగా వుంది. ఆనందపురం కుట్ర తర్వాత మళ్ళీ ఏ అమ్మకాలలోను మా చిన్నాన్న, తమ్ముళ్ళను ఇన్‌వాల్వ్ జేయలేదు. అలాని వాళ్ళతో గొడవపెట్టుకోలేదు. నేనెందుకు వాళ్ళను దూరంగా పెట్టాననేది అర్థమయి వుండదా? చంద్రం ఒకసారి కలుగజేసుకో బోయాడు.

'థాంక్యూ చంద్రం. భూమి డీలింగ్ ఏ ఒక్కరిపై ఆధారపడకుండా, ఎందుకు చేయలేను అని ఛాలెంజ్‌గా తీసుకొని ఫీల్డ్‌లోకి దిగేను. ఫర్వాలేదు. బాగానే సాగుతోంది అనిపిస్తోంది. అవసరమైతే నీ సహకారం తప్పక తీసుకుంటాను' అని చెప్పి దూరంగా నెట్టేను.

ఇప్పుడే కాదు. గతంలో జరిపిన భూమి అమ్మకపు వ్యవహారాలన్నింటిలోను నాకు మనస్ఫూర్తిగా సాయపడింది సన్నిబాబు ఒక్కడే. అతడు నన్ను ఎంత డబ్బు అడిగినా ఇస్తాను. ఒకవేళ అడగపోయినా నాకు తోచింది ఇవ్వాలని నిర్ణయించు కున్నాను. ఈ కేసులో బ్రోకర్ వుండి వుంటే పదిలక్షలైనా నానుంచి లాగివుండే వాడు. కనీసం అయిదు లక్షలు.

సమయం ఒంటిగంట దాటింది. రిజిస్టర్ ఆఫీసు నుంచి లాడ్జికి వెళ్ళడం, అక్కడ నుంచి గాలిలో ఎగిరి బెంగుళూరు వెళ్ళి పోవడమే మిగిలివుంది. ఇక ఇటు వైపు ఎప్పుడూ వచ్చేది లేదు గనుక, ఎవరిముఖం చూసేది లేదు గనుక... ఈరోజు ఎందుకో కొంత సమయం సన్నిబాబుతో గడపాలనిపించింది. వాడి ఆటోలోనే ప్రయణించి... ఏదైనా ఒక మంచి హోటల్‌కి వెళ్ళి వాడితో కలసి భోజనం చేయాలనిపించింది.

ఆ విషయం చెప్పగానే సన్నిబాబు సిగ్గుపడ్డాడు. సంతోషించేడు.

వాడేదో ఇబ్బంది ఫీలవుతున్నట్టు అనిపించి ఎంకరేజ్ చేశాను.

'అదికాదు అన్నా. నాకో పదినిమిషాలు పనివుంది. అది చేయాలి' అన్నాడు.

'దానికేముంది. నేను ఆటోలోనే వుంటాను. మధ్యలో నీ పని చేసుకొని వచ్చేద్దువు. తర్వాతే హోటల్‌కి వెళ్దాం' అన్నాను.

'అయితే సరే అన్నా' అంటూ ఆటో తీసేడు.

అంత మధ్యాహ్నం కూడా రోడ్డుపై వాహనాల రద్దీ.

ఆటోని స్పీడుగా పోనిస్తున్నాడు సన్నిబాబు. ఆక్సిడెంట్ చేయడుకదా. నాలో భయం.

సన్నిబాబు చిన్న హోటల్ ముందు ఆటో ఆపేడు. 'ఒక్క నిమిషం' అంటూ పరుగున వెళ్ళి, మూడు నిమిషాల్లో ఒక మీల్స్ పాకిట్ పట్టుకొని వచ్చేడు.

'ఇదెవ్వరికీ?' అనడిగేను ఆశ్చర్యపోతూ.

'మీకు తోవలో చూపిస్తాను కదా' అంటూ ఆటోని ముందుకు పోనిచ్చేడు.

రెండు మూడు మలుపులు తిరిగి ఆటో ఒక పాతబస్టాండ్ వద్ద ఆగింది.

అది పూర్తిగా పాడుపడిన బస్టాండ్. అక్కడ బస్ ప్రయాణీకులెవరూ లేరు. అక్కడంతా అపరిశుభ్రంగా చెత్తా చెదారంతో వుంది. ఒక మూలన వృద్ధుడు కూర్చొని వున్నాడు. అతనికి డెబ్బయ్యేళ్లుంటాయి. వంటిపై మాసిన బట్టలు. తైల సంస్కారం లేని జుట్టు. పెరిగిన గడ్డం. అతనిపై వాలుతున్న ఈగల్ని కూడా తోలుకోలేనంత నీరసంగా, దీనంగా వున్నాడు.

సన్నిబాబు తను తీసుకువచ్చిన మీల్స్ పాకిట్‌ని విప్పి వృద్ధుడికి తినిపించేడు. మంచినీళ్లు పట్టేడు. తర్వాత సీసాలో నీళ్ళతో చేతులు కడుక్కుని ఆటో ఎక్కి ముందుకు పోనిచ్చాడు.

'అన్నా! మీకు ఇబ్బంది కలిగించలేదు కదా. మిమ్మల్ని అనవసరంగా అయిదు నిమిషాలు కూర్చోబెట్టేసాను'

'అదేం లేదుగానీ ఆ ముసలాయన ఎవరూ? అడుక్కునేవాడా?'

'ఏమో తెలీదు అన్నా. అడుక్కునేవాడైతే నలుగురి మధ్యకు వెళ్ళి చేయిచాపి ఎలాగోలా తన కడుపు నింపుకునే ప్రయత్నం చేస్తాడు. కానీ ఈ ముసిలాడు ఎవరినీ చేయిచాపి అడగడం చూడలేదు. ఒక యోగిలా కదలడు. మెదలడు. అది చూసి నా కెందుకో జాలి వేసి అన్నం తీసుకొచ్చి తినిపించాను. శుభ్రంగా తిన్నాడు. ప్రతిరోజూ నాకు అది అలవాటుగా మారింది. ఓ పదిరోజుల నుంచి

సాగుతోంది. నేను టౌన్లోకి రానిరోజు మాతోటి ఆటోవాళ్ళకి చెబుతాను వాళ్ళు ముసిలాడికి అన్నం పెడతారు. డబ్బులు నేనిచ్చినా తీసుకోరు. పాపం ముసిలాడు ఎంత ఆకలితో వున్నాడోనండీ. అంతా రెండు నిమిషాల్లో తినేశాడు' అన్నాడు సన్నిబాబు.

రోడ్డుపై అందరూ ఏవో పనులపై పరిగెట్టేవాళ్ళే. ఎవరికీ పట్టనిది తను పట్టించుకొని ఒక మనిషి ఆకలి తీర్చడం... నన్ను కదిలించి వేసింది. నాకు గుర్తు వున్నంత వరకూ... అడుక్కునే వాడికి ఒక్కపైసా ధర్మం చేయలేదు నేను. అలా ధర్మం చేయడం యాచకవృత్తిని ప్రోత్సహించడంగా భావించేవాడిని సమసమాజం ఏ విప్లవం ద్వారో వచ్చేవరకూ వీళ్ళకు విముక్తి లేదు. ఈ విధంగా వుండేవి నా ఆలోచనలు.

తర్వాత ఒక పెద్ద హోటల్ వద్ద ఆటో ఆపి ఇద్దరం ఒక చల్లనిగదిలో భోజనం దగ్గర కూర్చున్నాం. సన్నిబాబు తృప్తిగా తింటున్నాడు. ఆకలితో వున్నట్టు న్నాడు. భోజనం చేస్తూ... వాడికి ఎంతో కొంత డబ్బులు ఇద్దామనుకున్న విషయం కదిపేను.

'సన్నీ, నీవు నాకు ప్రతీసారీ ఈ భూమి అమ్మకాలలో ఎంతగానో సాయం చేశావు. బ్రోకర్లు అయితే ఈ పాటికి నా నుంచి ఎన్నో లక్షలు గుంజేసే వాళ్ళు. నీవు నాకు నచ్చావు. డబ్బు నీవెంత అడిగినా ఇస్తాను. మొగమాట పడకు. ఎంతకావాలి?'

'రెండు లక్షలివ్వండి చాలు' అన్నాడు సన్నిబాబు.

***

పోస్టులో నాకు ఉత్తరం వచ్చింది.

ఫోన్లూ, ఈ మెయిల్లూ, యస్సెమ్మెస్సుల రోజుల్లో మనం వున్నప్పటికీ ఉత్తరాల విలువ అలానే వుంది. వుంటుంది. వుండాలి.

అన్ని బంధాలను వదులుకుని పూర్తిగా మర్చిపోదామనుకున్న నా కన్నపూరు నుంచి వచ్చింది ఉత్తరం. ఆతృతగా చదివేను.

సతీష్ బావగారికి –

నమస్కారములతో వ్రాయునది. మీరు సన్నిబాబు ద్వారా పంపిన సొమ్ము రెండు లక్షలు సమయానికి అందేయి. మీకు నా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నాను. రాలిపోవలసిన బతుకును ఆపి కనీసం మరో పది సంవత్సరాలు ఆయువునిచ్చేరు. నా ఆపరేషన్ మీ దయ వల్ల విజయవంతంగా

ముగిసింది. ఆ రోజు మమ్మల్ని కలిసి వెళ్ళిపోతున్నప్పుడు మీ చెల్లెలు నాతోనూ, సన్నిబాబుతోను అన్నది – 'మీరలా చూస్తుండండి. మా అన్నయ్య కచ్చితంగా ఆపరేషన్‌కి సాయం చేస్తాడు' అని. మీ చెల్లెలు మాటను అక్షరాలా నిజం చేశారు మీరు.

నాకు పునర్జన్మను ఇచ్చిన దాతలు మీరు మరియు తన కిడ్నీని త్యాగం చేసిన సన్నిబాబు. మీ ఇద్దరి రుణం నేనెలా తీర్చుకోగలను?

ఇట్లు

ప్రతి గ్రహీత

పోలినాయుడు

ఉత్తరం చదవగానే నాకు తల తిరిగిపోయింది. ఏడుపు వచ్చేసింది.

ఆ రోజు పోలినాయుడు నన్ను అప్పు అడిగిన విషయం పూర్తిగా మర్చి పోయేను. ఒకవేళ గుర్తున్నా అతడికి డబ్బు ఇచ్చే ఉద్దేశ్యం నాకప్పుడు ఏమాత్రం లేదు. అతడు కోరినవిధంగా నేను సహాయం చేసి వుంటే, సన్నిబాబు నా నుంచి ఆ రెండు లక్షలు కాదు కదా రెండు రూపాయలు కూడా తీసుకొని వుండేవాడు కాదని నాకిప్పుడు స్పష్టంగా అర్థమవుతోంది.

సన్నిబాబు నా నుంచి ఆ డబ్బు తీసుకున్నప్పుడు నాకు అసహ్యం కలిగింది. అతడిపై నాకున్న మంచి అభిప్రాయం ఒక్కసారిగా తుడుచు పెట్టుకుపోయింది. అందరిలానే అతడు కూడా ఒక స్వార్థపరుడిగా, డబ్బు ఆశించే మనిషిగా కనిపించేడు.

ఈ ఉత్తరాన్ని చూడకుంటే సన్నిబాబు పట్ల నా అభిప్రాయం మారేది కాదు. ఇప్పుడు నాపై నాకే అసహ్యం వేస్తోంది. అతనికి నేను చేతులెత్తి నమస్కరించా లనిపిస్తోంది. నన్ను తన చిననాటి స్నేహితుడిగా నలుగురితో గొప్పగా చెప్పుకునే అతడు అనూహ్యంగా ఈ స్నేహితుడిని ఒక ధర్మాత్ముడిగా చేసేసాడు- వాళ్లో నలుగురూ మరోవిధంగా కామెంట్ చేయకుండా. నాకు మాత్రం సిగ్గుగా వుంది. చేతిలో డబ్బు వుండి కూడా చావు బతుకుల మధ్యనున్న బావ గారికి ఆపద్ధర్మంగా అడిగిన రెండు లక్షలు ఇవ్వలేకపోయాను.

సన్నిబాబు దానం చేసిన కిడ్నీ విలువ ముందు నా మొత్తం డబ్బు నిలబడ గలదా? ఎందుకలా ప్రవర్తించేను? తోటి మనిషి కన్నా నాకు డబ్బే ఎక్కువ యిందా?

ఆ రోజు బస్టాండ్‌లో ముసలివాడికి సన్నిబాబు తిండి తినిపిస్తున్న దృశ్యం

గుర్తుకొచ్చింది. ఆ సేవ నేను చేయలేను. సన్నిబాబు మాత్రమే చేయగలడు.

మరి నేను ఏమీ చేయలేనా?

ఏదైనా చేయవచ్చు. భూములపై వచ్చిన కోట్లాది సొమ్ము నా వద్ద అలాగే వుంది. నిరుపేదలకు ఉపయోగపడేలా ఆ సొమ్మును ఏదైనా మంచిపనికి వినియోగిస్తే ఎలా వుంటుందనే ఆలోచన నాలో మొలకెత్తింది. ఒక ఉత్సాహం వచ్చింది. ఈ విషయం నా బాల్యమిత్రుడు సన్నిబాబుకి చెప్పాలి. పోలినాయుడిని చూడాలి. మా వూరు తప్పక వెళతాను.

*(చినుకు - జూన్ 2011)*